క్లుప్తంగా

వడ్డీలేని రుణాలు మంజూరు అభినందనీయం

ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి



మంగళగిరి: ఇస్లామిక్ షరియత్ ప్రకారం ఖిద్మత్ బ్యాంక్ పేద వారికి వడ్డీలేని రుణాలను అందించడం అభినందనీయమని ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి కొనియాడారు. నగరంలోని తెనాలి రోడ్డులోని ఖిద్మత్ బ్యాంకులో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో 12 మంది ఖాతాదారులకు రూ.5.70 లక్షల వడ్డీలేని రుణాలను అందజేశారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ రఫీ, ప్రతినిధులు ఎస్కే సంధానీ, అజీమ్ పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలపై టీడీపీ కపట ప్రేమ

తాడేపల్లి రూరల్: ముస్లిం మైనార్టీలపై తెలుగుదేశం పార్టీ కపట ప్రేమ చూపిస్తోందని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. మంగళవారం దుగ్గిరాల ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి వర్గంలో కనీసం ఒక్క మైనార్టీకి కూడా చంద్రబాబు అవకాశం ఇవ్వలేదని, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అన్యాయం చేశారని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలకు అండగా ఎన్నో అవకాశాలు కల్పించారని అన్నారు. సమావేశంలో మైనార్టీ నేతలు షేక్ రషీద్ సాహెబ్, పఠాన్ మస్తాన్ వలీ, షేక్ జాను పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లి రూరల్(దుగ్గిరాల): అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈమని ప్రాజెక్ట్ సీడీపీఓ ఎస్కే నూరానికి సీఐటీయూ నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం సంఘం మండల ఉపాధ్యక్షులు జెట్టి బాలరాజు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం 25 వేల రూపాయలు ఇవ్వాలని, ఈఎస్ఐ గ్రాట్యుటీ పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. అంగన్‌వాడీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, అద్దె భవనాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు అద్దె, కరెంటు బిల్లులు చెల్లించాలని విన్నవించారు. ఫిబ్రవరి 6వ తేదీన గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు జయ ఆదిలక్ష్మి, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తాడేపల్లి రూరల్: కార్పొరేషన్ పరిధిలోని కుంచనపల్లిలో నివాసముండే ఓ మహిళ చికిత్స పొందుతూ మంగళవారం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందింది. ఎస్ఐ వినోద్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఎనుముల రాజేశ్వరి(52) జనవరి 24వ టీ కాస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పు అంటుకుంది. వెంటనే భర్త మురళీకృష్ణ ఆ మంటలు ఆర్పేందుకు ప్రయత్నించగా అప్పటికే ఆమె శరీరం 80 శాతం కాలిపోయింది. కాపాడే క్రమంలో మురళీకృష్ణకు కూడా చేతులు, కాళ్లు కాలడంతో చికిత్స నిమిత్తం బంధువులు గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా రాజేశ్వరి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఘటనపై భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకుల సమావేశం

తాడికొండ: స్థానిక నియోజకవర్గ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి నియోజకవర్గ పరిశీలకులు బత్తుల బ్రహ్మానంద రెడ్డి హాజరవుతారని చెప్పారు. 4 మండలాల్లోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల అధ్యక్షులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు, పార్టీ గ్రామ అధ్యక్షులు, జేసీఎస్ కన్వీనర్లు, వార్డు మెంబర్లు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

బహిరంగంగా మద్యం తాగితే చర్యలు తప్పవు

మంగళగిరి: నగర పరిధిలోని రోడ్ల వెంబడి మద్యం తాగితే చట్టపరమైన చర్యలు తప్పవని పట్టణ ఎస్ఐ మహేంద్ర హెచ్చరించారు. నగరంలోని నగరపాలక సంస్థ కార్యాలయానికి చెందిన దుకాణాల ఎదుట మందుబాబులు ప్రతినిత్యం బహిరంగంగా మద్యం తాగుతున్నారు. మద్యం మత్తులో ఒక్కోసారి సీసాలు పగులగొట్టి గలాటా సృష్టిస్తూ స్థానిక ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పట్టణ ఎస్ఐ మహేంద్ర ఘటనా ప్రాంతానికి చేరుకుని బహిరంగంగా మద్యం తాగుతున్న ముగ్గురు మందుబాబులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. చట్టవ్యతిరేక పనులు ఎవరు చేసినా ఉపేక్షించేది లేదన్నారు. ప్రజలు చుట్టుపక్కల జరుగుతున్న చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

శరవేగంగా రోడ్ల నిర్మాణం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని ఓల్డ్ టోల్‌గేట్ దగ్గర నుంచి బకింగ్‌హామ్ కెనాల్ పశువుల హాస్పిటల్ వరకు, రాఘవేంద్ర నర్సరీ పక్కన మరో రోడ్డును కొత్తగా బీటీ రోడ్ నిర్మాణాన్ని మంగళవారం తెల్లవారుజామున పనులు ప్రారంభించారు. కార్పొరేషన్ ఎ.ఇ. కిషోర్ మాట్లాడుతూ 1.5 కిలోమీటర్ల దూరమున్న ఈ రెండు రోడ్లకు కార్పొరేషన్ ప్రత్యేక నిధుల నుంచి 1 కోటి 40 లక్షల రూపాయలు కేటాయించినట్లు చెప్పారు. ఈ రెండు రోడ్లు గత వర్షాకాలంలో గుంతలు పడడంతో కొత్తగా బీటీ రోడ్ నిర్మాణాన్ని చేపట్టినట్లు వివరించారు.

హిందూ శ్మశాన వాటిక మెరక పనులు

తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని గుండిమెడలో హిందూ శ్మశాన వాటికలో మంగళవారం నుంచి కార్పొరేషన్ అధికారులు గ్రావెల్ ఫిల్లింగ్ కార్యక్రమం చేపట్టారు. గుండిమెడ వాసులు ఎమ్మెల్యే ఆర్కేకు శ్మశాన వాటికలో జంగిల్ క్లియరెన్స్ చేసి గ్రావెల్ ఫిల్లింగ్ చేయాలని వినతిపత్రం అందజేయడంతో డీఈ కృష్ణారెడ్డి ప్రతిపాదన సిద్ధం చేసి 10 లక్షల రూపాయలు నిధులు కేటాయించారు. మూడు అడుగుల మేర గ్రావెల్ ఫిల్లింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు.



గుండిమెడ హిందూ శ్మశాన వాటికలో గ్రావెల్ ఫిల్లింగ్ చేస్తున్న లారీలు

ముస్లిం శ్మశాన వాటికకు విద్యుత్ సదుపాయం

తాడేపల్లి రూరల్: కార్పొరేషన్ పరిధిలోని పెనుమాకలోని ముస్లిం బరియల్ గ్రౌండ్‌లో ఫ్లెడ్‌లైట్ ఏర్పాటు చేసేందుకు కార్పొరేషన్ అధికారులు మంగళవారం పనులు ప్రారంభించారు. పెనుమాక ముస్లిం బరియల్ గ్రౌండ్‌లో గతంలో గ్రావెల్ ఫిల్లింగ్ చేసి అంతర్గత సిమెంట్ రోడ్ నిర్మాణం చేశారు. ముస్లింలు లైట్లు కూడా ఏర్పాటు చేయాలని కోరడంతో శ్మశానవాటిక మొత్తం వెలుగు వచ్చే విధంగా ఒక ఫ్లెడ్‌లైట్ ఏర్పాటు చేస్తున్నట్లు కార్పొరేషన్ ఏఈ కిషోర్ తెలిపారు.



పనులు చేస్తున్న పొక్లెయిన్

యర్రబాలెంలో సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన

మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెం గాంధీబొమ్మ సెంటర్‌లో రూ.9.90 లక్షల నిధులతో చేపట్టిన నూతన సిమెంట్ రోడ్డు నిర్మాణానికి స్థానికులు మంగళవారం శంకుస్థాపన చేశారు. గత కొన్నేళ్ల క్రితం నుంచి ఈ రహదారి మార్గం వర్షాకాలంలో బురదమయంగా మారి స్థానిక ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో బురద రోడ్డుపై స్థానికులు వరి నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. స్పందించిన అధికారులు సిమెంట్ రోడ్డు నిర్మాణం చేయిస్తామని హామీ ఇచ్చారు. కాలం గడచినా రోడ్డు నిర్మాణం ప్రారంభించలేదని స్థానికులు ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన నగరపాలక సంస్థ అధికారులతో ప్రతిపాదనలు సిద్ధం చేయించి రూ.9.90 లక్షల నిధులను కేటాయించగా మంగళవారం సీసీ రోడ్డు నిర్మాణానికి స్థానికులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గుండాల శ్రీనివాసరావు, పలగాని కోటేశ్వరరావు, దానబోయిన నాగయ్య, రేమిణిశెట్టి గోపి, ఆలా శివాజీ, బడే మియా పాల్గొన్నారు. కాగా దశాబ్దాల నాటి తమ రహదారి సమస్యను తీర్చిన ఎమ్మెల్యే ఆర్కేకు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న స్థానికులు

మద్యం తక్కువ పోశాడని బీరుసీసాతో దాడి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని మద్యం తాగే సమయంలో తన స్నేహితుడు కొంచెం మద్యం తక్కువ పోశాడని బీరు సీసాతో పొడిచాడు. ఈ ఘటనపై పోలీసులు మంగళవారం ఓ యువకుడిని అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరుపరిచారు. ఈ సందర్భంగా సీఐ శేషగిరిరావు మాట్లాడుతూ జనవరి 29వ తేదీన రాత్రి సమయంలో లంబాడీపేటకు చెందిన లక్ష్మణ్, నరేష్‌బాబు(నాని) ఇద్దరూ పాత నేరస్తులు. రైల్వే డంప్ యార్డులో ఇద్దరూ కలసి మద్యం తాగుతున్నారు. ఈ క్రమంలో లక్ష్మణ్, నరేష్‌బాబు(నాని)కి మద్యాన్ని తక్కువ పోశాడు. దాంతో మనస్తాపం చెందిన నరేష్‌బాబు మద్యం తక్కువ ఎందుకు పోశామని లక్ష్మణ్‌ను అడగడంతో ఎంత్రా నువ్వు మాట్లాడేది అంటూ చేతులతో దాడి చేశాడు. నాకు మందు తక్కువ పోసింది కాక నన్ను కొడతావా అంటూ నరేష్‌బాబు పక్కనే ఉన్న బీరు బాటిల్ తీసుకుని పగలకొట్టి లక్ష్మణ్ పొట్టలో, ఛాతీలో పొడవడంతో గాయపడినట్లు చెప్పారు. ఘటనపై లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుడి తాడేపల్లి పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్ఐ రమేష్, క్రైం సిబ్బంది కొండలరావు, బాబూరావు అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరు పరిచినట్లు వివరించారు.

కేఎల్‌యూలో సైబర్ సెక్యూరిటీపై వర్క్‌షాప్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో మంగళవారం 24 గంటల సైబర్ సెక్యూరిటీ వర్క్‌షాప్ నిర్వహించారు. విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ చప్పిడి హనుమంతరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నతస్థాయికి చేరుకోవడానికి చాలా కృషి చేయాలని అన్నారు. ప్రతి ఒక్కరూ కంప్యూటర్‌లోని డేటా భద్రత యొక్క లాభనష్టాలు తెలుసుకుని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ విషయాలు తెలియాలంటే సైబర్ టెక్నాలజీని అలవాటు చేసుకుని సాధన చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, సాక్ డైరెక్టర్ సాయివిజయ్, సైబర్ సెక్రటరీ సందీప్ పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న డీన్ హనుమంతరావు

పాఠశాలలో నెలకొన్న సమస్యలను అప్‌లోడ్ చేయండి

ఎంఈఓ లక్ష్మీనారాయణ

తెనాలిఅర్బన్: ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఎస్‌టీఎంఎస్ లాగిన్‌లో సీఎం గ్రీవెన్స్ ద్వారా ఫోటోలను అప్‌లోడ్ చేయాలని మండల విద్యాధికారి మేకల లక్ష్మీనారాయణ సూచించారు. కొత్తపేటలోని ఎంఈఓ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. నాడు–నేడు ఫేజ్–1 పనులపై సమీక్ష జరిపారు. ఇంకా ఏమైనా పనులు మిగిలి ఉంటే వాటిని పూర్తి చేయించేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోందని, ఈ అవకాశాన్ని అందరూ ఉపయోగించుకోవాలని సూచించారు. మండల స్థాయిలోని బృందాలన్ని అన్ని పాఠశాలలను తనిఖీ చేసి రిపోర్టును అందజేయాలన్నారు. ఉన్నతాధికారులు పాఠశాలలను తనిఖీ చేసే అవకాశం ఉన్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎంఆర్‌సీలు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ లక్ష్మీనారాయణ

5న కంటి వైద్యశిబిరం

తెనాలి: పెదకాకానిలోని శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా ఫిబ్రవరి 5వ తేదీన ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించనున్నారు. స్థానిక సుల్తానాబాద్‌లోని శ్రీసరస్వతి శిశుమందిర్ ప్రాంగణంలో ఆరోజు ఉదయం 8 గంటల్నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు చేస్తారు. అవసరమైనవారికి శంకర కంటి ఆసుపత్రిలో ఉచితంగా శుక్లాల ఆపరేషను చేస్తారు. పట్టణానికి చెందిన కుమార్ పంప్స్, సోదర సంస్థ సుబ్రమ్ సంస్థల సహకారంతో వైద్యశిబిరం జరుపనున్నట్లు నిర్వాహకులు వివరించారు.

వంట గ్యాస్ వినియోగంలో అప్రమత్తంగా ఉండండి

తెనాలి అర్బన్: వంటగ్యాస్ ఉపయోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని శ్రీ సత్యనారాయణ ఇండియన్ ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకులు మురళీకృష్ణ సూచించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో చెంచుపేటలోని కోగంటి శివయ్య హైస్కూల్‌లో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వంట గ్యాస్ వల్ల జరిగే ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన తెలియజేశారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు రాజారెడ్డి, కోగంటి వెంకట్రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి

తెనాలి రూరల్: అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతి చెందిన ఘటన తెనాలిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ గురవయ్య కాలనీకి చెందిన యర్రంశెట్టి పున్నమ్మ భర్త 20 ఏళ్ల క్రితం మృతి చెందాడు. ముగ్గురు కుమారులు, కుమార్తె ఉండగా వారికి వివాహాలై వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నారు. ఒంటరిగా నివసిస్తున్న పున్నమ్మ మంగళవారం తన గదిలో మృతి చెంది ఉంది. ఉదయం బయటకు రాకపోవడంతో చుట్టుపక్కల వాళ్లు లోనికి వెళ్లి చూడగా మృతి చెంది ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మంగళగిరి: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల నిమిత్తం బుధవారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ అక్కల సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30ల వరకూ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని చెప్పారు. నగరంలోని ఆంజనేయ కాలనీ, గాజుల వారి వీధి ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపల్లె రూరల్: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో బుధవారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ ఎల్ భాస్కరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కోత ఉంటుందని చెప్పారు. రేపల్లె పట్టణం, మండలంలోని ఇసుకపల్లి, అరవపల్లి, మోర్తోట ప్రాంతంలో వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాలామృతంతో పిల్లలకు ఆరోగ్యం



ఫిరంగిపురం: మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ని అంగన్‌వాడీ సెంటర్లను ఐసీడీఎస్ సిబ్బంది మంగళవారం తనిఖీ చేశారు. ప్రాజెక్ట్ కార్యాలయంలో ఐసీడీఎస్ సీడీపీఓ పి.ప్రసూన మాట్లాడుతూ మేరికపూడి గ్రామంలోని ఓసీ, బీసీ అంగన్‌వాడీ సెంటర్లు, ఫిరంగిపురంలోని1, 10, 13వార్డులలోని అంగన్‌వాడీ సెంటర్లను సూపర్‌వైజర్లు తనిఖీ చేసినట్లు వివరించారు. తనిఖీల్లో సూపర్‌వైజర్లు టి.హేమలత, ఆనందకుమారి పాల్గొన్నారు.

పెనుమాక సచివాలయంలో సీసీ కెమెరాలు ధ్వంసం

- టీడీపీ కార్యకర్తల అరాచకం
- ఫిర్యాదు చేసిన గ్రామ సచివాలయ సెక్రటరీ

తాడేపల్లి రూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని పెనుమాక గ్రామ సచివాలయంలో టీడీపీ కార్యకర్తలు చేసిన అరాచకం ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఘటనపై సచివాలయ సెక్రటరీ మేకల నరేష్ బాబు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సేకరించిన వివరాలు.. పెనుమాకకు చెందిన టీడీపీ కార్యకర్తలు మెరుగుమళ్ళ సతీష్(పెప్సీ), అశోక్‌లు పుటూగా మద్యం తాగి సచివాలయం దగ్గర ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీలను చింపివేసి, అనంతరం గ్రామ సచివాలయం పైభాగంలో ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. కెమెరాలను ధ్వంసం చేస్తున్న దృశ్యాలు రికార్డు అయ్యాయి. జరిగిన ఈ ఘటనపై ఎస్ఐ నారాయణ కేసు నమోదు చేశారు. సతీష్ (పెప్సీ) పెనుమాకలో గతంలో గంజాయి అమ్మిన కేసులో పోలీసులు అరెస్ట్ కూడా చేశారు.

శరవేగంగా ఘాట్‌రోడ్డు పనులు

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ గ్రామంలోని కొండపైనున్న మూలాంకురేశ్వరి ఆలయానికి వెళ్లేందుకు వేస్తున్న ఘాట్‌రోడ్డు పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. ఇటీవల నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవిలు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కాగా వారం రోజులుగా కొండపైకి వెళ్లే మార్గంనిర్మాణం కోసం పొక్లెయిన్ సహాయంతో మట్టి రోడ్డు పనులు నిర్వహిస్తున్నారు. దీని నిర్మాణం కోసం సుమారు రూ.30 లక్షల వరకు ఖర్చు అవుతుండగా దాతల, గ్రామస్తుల సహకారంతో పనులు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఘాట్‌రోడ్డు నిర్మాణం ద్వారా భక్తులు వాహనాల ద్వారా కొండపైకి వెళ్లి మూలాంకురేశ్వరి అమ్మను దర్శించుకునేందుకు వీలవుతుందని చెబుతున్నారు.



గ్రంథాలయాలతో విజ్ఞానం

రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని

మంగళగిరి: గ్రంథాలయాల ద్వారా అపరిమితమైన జ్ఞానం సొంతమని, గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావుతో చర్చించారు. ఈ సందర్భంగా కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రంథాలయ వ్యవస్థను నిర్వీర్యం చేశారని, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరలా గ్రంథాలయాలకు పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు కృషి చేశారని కొనియాడారు. గ్రంథాలయ వ్యవస్థను డిజిటలైజేషన్ చేపట్టడం జరుగుతుందని చెప్పారు. ప్రెస్ అకాడమీ తరఫున సీనియర్ జర్నలిస్టులు రాసిన పుస్తకాలను గ్రంథాలయాల్లోకి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. జర్నలిస్టులకు హెల్త్ స్కీం, హెల్త్ కార్డులు, రెన్యువల్ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, పక్కన శేషగిరిరావు

ముగ్గు రోడ్డులో ఉచిత వైద్యశిబిరం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని ముగ్గు రోడ్డు వద్ద గల తెలుగు బాప్టిస్ట్ చర్చి కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం విన్ విజన్ కంటి హాస్పిటల్, వీజీఆర్ డయాబెటిస్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పాస్టర్ కె.రవికుమార్ మాట్లాడుతూ సుమారు వందమందికి పైగా డయాబెటిస్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామని తెలిపారు. విన్ విజన్ కంటి హాస్పిటల్ సహకారంతో సుమారు 90 మందికి కంటిపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి హాస్పిటల్‌కు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ దర్శనపు శామ్యూల్, విన్ విజన్ కంటి హాస్పిటల్ వైద్యులు ఉప్పలపాటి నిశాంత్ జనార్ధన్ రాజు, మార్కెటింగ్ పర్సన్ బాషి, సిబ్బంది జ్ఞానేశ్వరి, శివ, విజీఆర్ డయాబెటిస్ స్పెషాలిటీస్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ శివప్రసాద్, సిబ్బంది తరుణ్, కృష్ణ, చైతన్య, యశ్వంత్, భాస్కర్, రంగారెడ్డి, జడ్సా, బెంజిమన్, అనిల్ పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆన్‌లైన్ మోసం చేస్తున్న నిందితుల అరెస్ట్

- 80 గ్రాముల బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ స్రవంతిరాయ్

తెనాలి రూరల్: ఆభరణాల కొనుగోలు పేరిట దుకాణ యజమానులను బురిడీ కొట్టిస్తున్న వ్యక్తితో పాటు వాటిని విక్రయించి సొమ్ము చేసుకునేందుకు సహకరిస్తున్నా మరోవ్యక్తిని అరెస్ట్ చేశారు. ఆన్‌లైన్ చెల్లింపు పేరిట రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో నిందితులు మోసాలకు పాల్పడ్డారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ డాక్టర్ కె. స్రవంతిరాయ్ వివరాలను వెల్లడించారు. బాపట్ల జిల్లా్ ముప్పవరం మండలానికి చెందిన ఉదరగుడి అశోక్ బంగారు షాపులను టార్గెట్ చేస్తూ మోసాలకు పాల్పడుతున్నాడు. ఇందులో భాగంగానే తెనాలి టూ టౌన్ పీఎస్ పరిధిలోని ఓ బంగారు షాపులో 48 గ్రాముల రెండు బంగారు గొలుసులు కొనుగోలు చేశాడు. షాపు యజమానికి నగదు ఇవ్వకుండా ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్ చేస్తానంటూ నమ్మబలికాడు. అలా తన ఫోన్‌లోని యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో డబ్బులు పంపినట్లు సెండ్ కంప్లీట్ అంటూ స్క్రీన్ షాట్ ఎడిటింగ్ చేసి షాపు యజమానికి చూపించాడు. అనంతరం అక్కడి నుంచి ఆభరణాలతో వెళ్లిపోయాడు. తర్వాత తమకు నగదు జమ కాకపోవడాన్ని షాపు యజమాని గుర్తించి పోలీసులను ఆశ్రయించగా టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా నిందితుడు ఉదరగుడి అశోక్‌ను గుర్తించి విచారిస్తే ఇలా అనేక చోట్ల మోసాలు చేసినట్లు గుర్తించారు. తెనాలితో పాటు మంగళగిరి, విజయవాడ, గుంటూరు, ఒంగోలు ప్రాంతాల్లో పలు షాపుల్లో మొత్తం 334 గ్రాముల బంగారు ఆభరణాలు కొనుగోలు చేసి యజమానులను ఈ విధంగానే మోసగించినట్లు నిర్ధారించారు. మోసం చేసి కాజేసిన ఆభరణాలను విజయవాడకు చెందిన హిందూస్తాన్ గోల్డ్ కంపెనీ మేనేజర్ కొలచిన శ్రీనివాస్‌తో కుమ్మక్కై అతడికి కమిషన్లు ఇస్తూ నగలు అమ్మి సొమ్ము చేసుకుంటున్నాడు. దీంతో ప్రధాన నిందితుడితో పాటు గోల్డ్ కంపెనీ మేనేజర్ శ్రీనివాస్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి ప్రస్తుతానికి 80 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకోగా మిగిలినది రికవరీ చేయాల్సి ఉందని డీఎస్పీ తెలిపారు. బెంగుళూరు కేంద్రంగా ఉన్న హిందూస్తాన్ గోల్డ్ కంపెనీ అసలైందా లేదా నకిలీదా అన్నది కూడా విచారించే పనిలో పోలీసులు ఉన్నారు. సమావేశంలో డీఎస్పీ స్రవంతిరాయ్‌తో పాటు సీఐ ఎస్ వెంకట్రావు, ఎస్ఐ నాగేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ స్రవంతిరాయ్, పక్కన సీఐ వెంకట్రావు

నేత్ర, శరీరదానం చేసిన కొత్తపల్లి సుధాబాల

తెనాలి: భౌతికంగా మరణించినా ఉదాత్తమైన ఆశయంతో కొందరు చిరంజీవులుగా ఉంటారు. ఇంకొకరి శరీరాల్లో జీవించే ఉంటారు...నవీన ఆవిష్కరణలకు దోహదపడే ప్రయోగాలకూ ఉపయోగపడతారు. పట్టణంలోని ఈటీ కాలనీకి చెందిన కొత్తపల్లి సుధాబాల (77)ఇందుకో నిదర్శనం. ఆమె భర్త కొత్తపల్లి రవిబాబు. జనసాహితి మాసపత్రికకు నాలుగు దశాబ్దాలుగా ప్రధాన సంపాదకుడుగా ఉన్నారు. రేపల్లె దగ్గర్లోని నగరం డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్‌గా పని చేసి రిటైరయ్యారు. రవిబాబు సాహిత్య ఉద్యమానికి చేదోడువాదోడుగా ఉంటూ వచ్చిన సుధాబాల, మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు స్వగృహంలో మృతిచెందారు. కుటుంబసభ్యులు ఆమె అంతిమయాత్ర వంటి చివరి సంస్కారాలను తలపెట్టలేదు. గుంటూరులోని అగర్వాల్ కంటి ఆసుపత్రికి ఆమె నేత్రాలను దానం చేశారు. దన్వంతరి ఐ డొనేషన్ కేంద్రం సహకారంతో ఉదయాన్నే ఆమె కార్నియాను సేకరించుకువెళ్లారు. శరీరాన్ని వైద్యవిద్యార్థుల పరీక్షల కోసం అప్పగించగా, ఆ ప్రకారం విజయవాడ దగ్గర్లోని నిమ్రా వైద్య కళాశాల టెక్నీషియన్లు సాయంత్రం సుధాబాల భౌతికకాయాన్ని స్వాధీనం చేసుకున్నారు. నాస్తిక సమాజం అధ్యక్షుడు, అమ్మ అవయవ, శరీరదాన సంఘం, తెనాలి కో–ఆర్డినేటర్ నందూరి నారాయణరావు సహకరించారు. జనసాహితి ఉభయ తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు దివికుమార్, ప్రజాసాహితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ అరుణ, రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బొల్లిముంత సాంబశివరావు, బుద్ధభూమి ఎడిటర్ గోలి సీతారామయ్య, రచయితలు బొర్రా గోవర్ధన్, ముత్తేవి రవీంద్రనాథ్, దాసరి శివకుమారి, వెంకటేశ్వర్లు బొమ్మదేవర వెంకటేశ్వర్లు, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, అయినాల మల్లేశ్వరరావు, బొల్లిముంత కృష్ణ, చందు నాగేశ్వరరావు, గద్దే శ్రీనివాసరావు, బసవరావు, షేక్ అబ్దుల్ హకీంజాని, గంటినపాటి ప్రేమ్‌చంద్ నివాళులర్పించినవారిలో ఉన్నారు.



వైష్ణవి కళాశాలలో ఫిలాటలి ఎగ్జిబిషన్

తెనాలిఅర్బన్: రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ వైష్ణవి జూనియర్ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన ఫిలాటలి ఎగ్జిబిషన్‌ను తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కొల్లూరు శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 15 వరకు నేషనల్ ఫిలాటలి ఎగ్జిబిషన్‌ను ఢిల్లీలో నిర్వహించనున్నట్లు తెలిపారు. దానిలో భాగంగా తెనాలిలో దీనిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనంతరం రాష్ట్ర స్థాయిలో అనేక పురస్కారాలు పొందిన వి.సాయికృష్ణ సేకరించిన పలు స్టాంపులను ప్రదర్శనలో ఉంచారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పాటిబండ్ల శ్రీనివాసరావు, అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ వి.వాసవి, పవన్‌కుమార్, శివయ్య పాల్గొన్నారు.